www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 8 జనవరి 2025



అన్న క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉంచండి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



నగరంలోని అన్నా క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచి, నాణ్యమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో స్విమ్స్ కూడలి, న్యూ బాలాజి కాలని, ముత్యాలరెడ్డి పల్లి, ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద నాలుగు అన్నా క్యాంటీన్లు నిర్వహిస్తున్న విషయం విదితమే. మంగళవారం మధ్యాహ్నం ఈ అన్నా క్యాంటీన్లను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన ప్రజలతో మాట్లాడి, ప్రజలకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూసి సంతప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ వెంట డి.ఈ. మహేష్ ఉన్నారు.

కుప్పం అభివృద్ధి దిశగా... చంద్రబాబు అడుగులు



'జననాయకుడు' పోర్టల్ ప్రారంభం
అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
శ్యామన్న విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - కుప్పం టౌన్, కుప్పం రూరల్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన రెండు రోజులూ విజయవంతంగా సాగింది. రెండోరోజు మంగళవారం రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో శాంతిపురం మండలం తుమ్మిసి గ్రామానికి చెందిన టిడిపి అభిమాని శివ, సత్య దంపతుల కుమారునికి జితేంద్రగా నామకరణం చేశారు. నామకరణం అనంతరం టిడిపి కార్యాలయానికి చేరుకుని ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జననాయకుడు' పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 1090 అర్జీలను సిఎం దృష్టికి అర్జీదారులు స్వయంగా తీసుకెళ్లారు. అక్కడినుండి కంగుంది గ్రామానికి చేరుకుని శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామన్న కంగుంది గ్రామ సర్పంచ్‌గా, కళాకారుడిగా, ఉత్తమ రైతుగా పేరుందిన ప్రజ్ఞాశాలి అని కొనియాడారు.

ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం

'నన్ను గుండెల్లో పెట్టుకుని ఇంతవాణ్ణి చేసిన కుప్పం ప్రజల రుణం తీర్చుకునేందుకే స్వర్ణకుప్పం విజన్ -2029 డాక్యుమెంట్ రూపొందించా. పేదరిక నిర్మూలన, పరిశ్రమలు, ఉద్యోగ కల్పన, నైపుణ్య శిక్షణా కేంద్రాలు, అందరికీ విద్య వంటి 10 అంశాలకు విజన్ డాక్యుమెంటులో ప్రాధాన్యత ఇచ్చాం' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కుప్పం రెండోరోజు పర్యటనలో మదర్ డెయిరీ, కడా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడారు.. ఆయన మాటల్లోనే..

మరో మూడు నెలల్లో కుప్పానికి వస్తాను. కడా ఆధ్వర్యంలో కుప్పంలో చేపట్టే అభివృద్ధి పనులను నేను స్వయంగా పర్యవేక్షిస్తాను. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.92.22 కోట్లు మంజూరు చేశాము. అందులో రూ. 2 2



టిడిపి అభిమాని కుమారునికి జితేంద్రగా చంద్రబాబు నామకరణం

కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేస్తాము. గత ఐదేళ్ల ఈ ప్రాంగణాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారు. రూ.20 కోట్ల వ్యయంతో కుప్పంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేస్తాం. రూ.10 కోట్ల వ్యయంతో కుప్పంలో 10 జంక్షన్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారులను సుందరీకరిస్తాము. విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు చేశాం. రూ.19 కోట్ల వ్యయంతో పార్కులను అభివృద్ధి చేయబోతున్నాము. కుప్పం నియజకవర్గంలో గుంతల రోడ్లు కనపడకూడదు. రహదారుల అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ. 34.27 కోట్లు మంజూరు చేశాం. శాంతిపురం పరిధిలో మదర్ డెయిరీకి 41 ఎకరాల 21 సెంట్లు ఇచ్చాము. రూ. 105 కోట్ల వ్యయంతో రాబోతున్న ఈ డెయిరీ వల్ల 4 వేలమందికి ఉద్యోగాలు వస్తాయి. అలాగే శ్రీజ మహిళా మిల్క్ సంస్థ ఏర్పాటుతో మరో 4 వేల ఉద్యోగాలు రాబోతున్నాయి. కుప్పం పరిధిలో రూ.22 కోట్ల వ్యయంతో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశాం. డ్వాక్రా ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశాను. ఇప్పుడు కుప్పం నియోజకవర్గంలో అలీప్ సంస్థ సహకారంతో మహిళలకు పలు ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తారు.

శ్రీకాళహస్తిలో..



తిరుపతిలో...



గూడూరులో..



ప్రత్యేక హోదా మాట తప్పిన బిజెపి

మోడీ రావద్దు..మా రాష్ట్రానికి..!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

'ఆంధ్ర రాష్ట్రానికి అన్ని విధాలా ద్రోహం చేసిన ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్రానికి రావద్దు..రావద్దు' అంటూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిరసనలు జరిగాయి. కడప ఉక్కు, వెనుకబడిన రాయలసీమకు నిధులు, ప్రత్యేక హోదా ఇవ్వకుండా మాట తప్పిన మోడీ ఏ మొహం పెట్టుకుని రాష్ట్రానికి వస్తారని నేతలు ప్రశ్నించారు. 8వ తేదీ బుధవారం ప్రధానమంత్రి మోడీ విశాఖ పర్యటన పురస్కరించుకుని నిరసనలు జరిగాయి.

తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద 'గో బ్యాక్ నరేంద్రమోడీ రావద్దు' అంటూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ విభజన చట్టంలో భాగంగా కడప ఉక్కు పరిశ్రమను 20వేల కోట్ల పెట్టుబడి అంచనాతో 20 లక్షల టన్నుల సామర్ధ్యంతో ప్రత్యక్షంగా 25వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేక హోదా కల్పిస్తామని పార్లమెంట్ సాక్షిగా చెప్పారన్నారు. ఆంధ్రరాష్ట్ర ప్రజలను నమ్మించి మోసం చేసిన మోడీ ఏ మొహం పెట్టుకుని రాష్ట్రానికి వస్తారని ప్రశ్నించారు. ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా 2007, జూన్ 10న అంబవరం గ్రామ సమీపంలో

జిల్లాలో సిపిఎం నిరసనలు

శంకుస్థాపన చేసిన ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించి, ఉపాధి కల్పించాలని డిమాండ్‌చేశారు. 2018లో గండికోట రిజర్వాయర్ సమీపంలో కంబాలదిన్నె వద్ద రెండోసారి, 2019లో డిసెంబర్ 23న ముచ్చటగా మూడోసారి శంకుస్థాపన చేశారన్నారు. 2023, ఫిబ్రవరి 15న మరోసారి శంకుస్థాపన చేశారన్నారు. నాలుగుసార్లు శంకుస్థాపన చేసిన ఉక్కు పరిశ్రమ ఒక్క అడుగు కూడా ముందుకు పోలేదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహాలో 11వేల కోట్ల నిధులు రావాల్సి ఉందన్నారు. కేవలం మూడేళ్లు 50 కోట్ల చొప్పున ఇచ్చి బిజెపి దగా చేసిందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి సుబ్రమణ్యం, ఎస్ జయచంద్ర, మాధవ్ కష్ణ, పి బుజ్జి, పి సాయి లక్ష్మి, పి హేమలత, ఎం జయంతి, ఎం నరేంద్ర, ఆర్ మల్లికార్జునరావు, ఏ రాధాకష్ణ, పి రమేష్, ఎం రాజు, జి చిన్నబాబు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో...అంబేద్కర్ కూడలి వద్ద మోడీ గోబ్యాక్ అంటూ నిరసన తెలిపారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ గత రెండేళ్లుగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేయొద్దంటూ పోరాటాలు చేస్తుంటే, పట్టించుకోని మోడీ మిట్టల్ స్టీల్ పరిశ్రమకు ఏ విధంగా చేయూతనిస్తారని ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, నాయకులు పెనగడం గురవయ్య, కుమార్, రాధమ్మ పాల్గొన్నారు. **సత్యవేడులో...**సిపిఎం కార్యదర్శి మెలుగు రమేష్ ఆధ్వర్యంలో పి.మునిరాజా, మునస్వామి, పేరడం 'మోడీ గో బ్యాక్' అంటూ నినాదాలు చేస్తూ కరపత్రాలను పంచిపెట్టారు. **రేణిగుంటలో ...** రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాని మోడీకి బాబు, పవన్‌కల్యాణ్‌లు రెడ్‌కార్పొరేట్ పరవడానికి సిగ్గులేదా? అని రేణిగుంటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కె.హరినాథ్, ఏర్పేడు మండల నాయకులు కరీముల్లా నాయకత్వం వహించారు. ఆంధ్రుల ఆత్మగౌరవమైన విశాఖ ఉక్కును కార్పొరేట్లకు అమ్మబోనని ప్రమాణం చేసిన తర్వాతనే పర్యటించాలని నినాదాలు చేశారు. నాయకులు సెల్వరాజ్, సత్యశ్రీ, ఒ.వెంకటరమణ, శివానందం పాల్గొన్నారు. **పుత్తూరు టౌన్‌లో...** అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎ.విజయ్, కెఆర్ సుబ్రమణ్యం, హరీష్ నాయుడు, కృష్ణమూర్తి, కందస్వామి, గోవింద్‌స్వామి పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో.. సిపిఎం ఆర్గనైజర్ జోగి శివకుమార్ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సెంటర్‌లో నిరసన తెలిపారు. నాయకులు శ్రీనివాసులు, సురేష్, బివి రమణయ్య పాల్గొన్నారు.

పారదర్శకత ఏది... 'ఈఆర్‌సి'..!

ప్రజాభిప్రాయ సేకరణలో కందారపు మురళి



ప్రజాశక్తి - తిరుపతి సిటి

వినియోగదారుల ప్రయోజనాలను రక్షించాల్సిన విద్యుత్ నియంత్రణ మండలి ఏపీఈఆర్ సి ప్రజలపై భారాలు మోపటానికి మినహా, ధరలు క్రమబద్ధీకరించడానికి కాదని అనుభవం తేల్చేసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి వ్యాఖ్యానించారు. విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ విచారణలో మంగళవారం మధ్యాహ్నం తిరుపతి సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి కందారపు మురళి సిపిఎం తరపున వాదనలు వినిపించారు. డిస్కంలు తప్పుడు అంచనాలను చెప్పి తప్పుదారి పట్టిస్తున్నాయని విమర్శించారు. విద్యుత్ కొనుగోలు చేసేటప్పుడు అభ్యంతరాలు చెప్పకుండా, ఇప్పుడు ట్రూ అప్ పేరిట భారాన్ని వినియోగదారులపై మోపటానికి పూనుకోవటం వల్ల కమిషన్‌కు ఉన్న నైతికత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పాలకుల చేతికి మట్టి అంటకుండా ప్రజలపై విద్యుత్ భారాలు మోపటానికి ఈఆర్ సి సాధనంగా మారిపోయిందని అన్నారు. సెకీ విద్యుత్ ఒప్పందం, స్మార్ట్ మీటర్ల బిగింపు వంటివి పై కోవలోకే వస్తాయని అన్నారు. గత ప్రభుత్వం 32 వేల కోట్ల రూపాయల భారాన్ని మోపితే ప్రస్తుత ప్రభుత్వం ఆరు నెలల్లోనే 16 వేల కోట్ల రూపాయల భారాన్ని మోపటం దారుణమని విమర్శించారు. విద్యుత్ సంస్కరణల విషయంలో వైసిపి, తెలుగుదేశం పార్టీలది ఒకటే బాటన్నారు.లక్షల కోట్ల రూపాయలను ఉత్పత్తిదారులకు తేలికగా ఇచ్చేస్తున్న డిస్కంలు, తమ దగ్గర పనిచేసే ఉద్యోగులు ఔట్సోర్సింగ్ కార్మికుల విషయం పట్టించుకోకపోవడం, వారికి రావలసిన కనీస సదుపాయాలు అమలు చేయకపోవడం దారుణం కాదా? అని ప్రశ్నించారు. పునరుత్పాదక విద్యుత్ (రెన్యువబుల్ ఎనర్జీ) ఆర్ఈని అధిక ధరలతో అవసరానికి మించి కొనుగోలు చేస్తూ, వేలాది కోట్ల రూపాయలు అదానీ, షిరిడి సాయి లాంటి కంపెనీలకు కట్టబెట్టడం సమంజసం కాదని, తక్షణం ఈ ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సెకి తో ఒప్పందం రద్దు చేసుకోవాలని, తాజా టెండర్లు పిలవాలని ఆయన కోరారు. వ్యవసాయ పంపు సెట్లు, నివాస గహాలు, చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లను పెట్టొద్దని, తక్షణం ఆ ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని కోరారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేంద్ర నాయుడు, డిఇ చంద్రశేఖర్, ఎస్ ఏ శ్రీనివాసులు, డిఇ (టెక్నికల్) వాసవీలత తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్మికులకు కనీస వేతనం 26 వేలివ్వాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ ఆశా కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని నేతలు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్స్ దామల చెరువు సెక్టార్ జనరల్ బాడీ సమావేశం సిఐటియు మండల కన్వీనర్ ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆశా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు లక్ష్మీ, జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పనికి తగ్గ ఫలితం లేదన్నారు. ప్రభుత్వం కనీస వేతనం 26వేలకు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.అధ్యక్షురాలుగా జయమ్మ, ఉపాధ్యక్షురాలిగా శివరంజని, కార్యదర్శిగా గంగులమ్మ, సహాయ కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా రేవతి ఎన్నికయ్యారు.

ప్రైవేట్ ఆస్పత్రుల్లో... ఫీజుల బాదుడు..!

ప్రజాశక్తి - నాయుడుపేట

ప్రైవేట్ ఆస్పత్రులు ఫీజుల రూపంలో రోగులను పిండేస్తున్నాయి. రోజురోజుకూ నాయుడుపేట పట్టణంలో ఫీజుల పేరుతో దోపిడీ పెరిగిపోతోంది. నాయుడుపేటకు చుట్టుపక్కల నాలుగైదు మండలాలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలకు నాయుడుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రులే దిక్కు. దీంతో ఇక్కడి వైద్యం వ్యాపారంగా మారిపోయింది.

నాయుడుపేటలో కొంతమంది వైద్యులు సేవా దృక్పథంతో చూస్తుంటే, మరికొంతమంది మాత్రం వ్యాపారంలా చూస్తున్నారు. ఏమాత్రం దయాదాక్షిణ్యం లేకుండా దోచుకుంటున్నారన్నది వాస్తవం. ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్య ధోరణిని భరించలేని కొంతమంది రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అయితే వీరు ఫీజుల రూపంలో పిండేస్తున్నారు. పేషంట్‌ను ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళితే, ఆ బిల్లు కట్టే వ్యక్తి తిరిగి పేషంట్‌లా మారేంతగా ఈ దోపిడీ కొనసాగుతోంది.

తాజాగా రెండు రోజుల క్రితం ఓ ఆస్పత్రిలో జరిగిన ఘటన గురించి చెప్పుకోవాలి. నాయుడుపేట పట్టణంలో శ్రీకాళహస్తి బైపాస్-రోడ్డులో ఆ ఆస్పత్రి ఉంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆ ఆస్పత్రిని డాక్టర్ స్వయంగా నిర్వహిస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్‌కు అతి

బిల్లులివ్వరు.. తనిఖీలు ఉండవు..



సమీపంలో ఉంది. ఈ ఆస్పత్రిలో డాక్టర్ ఫీజు పైకి చెప్పుకోడానికి రూ.150 మాత్రమే. అయితే అక్కడనుంచే మొదలవుతుంది దోపిడీ. పేషంట్ చిన్న సమస్యతో వెళ్లినా అవసరం ఉన్నా లేకపోయినా పరీక్షల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తుంటారు. వీళ్ల వ్యాపారం అంతటితో ఆగిపోలేదు. ఆస్పత్రిలో గంటా రెండు గంటలు ఉన్నా సరే బెడ్ ఛార్జీలని, క్లీనింగ్ ఛార్జీలని, నర్సులకు, కాంపౌండర్లకు... ఇలా ఒక్కో పేరుతో వీళ్లు వేసే ఫీజులు పేషంట్ల రక్తాన్ని పిండేస్తుంటాయి. పైగా ఈ ఫీజులన్నీ బిల్లుల రూపంలో ఉండవు. పేషంట్ దగ్గర వసూలు చేస్తున్న డబ్బులకు పది శాతం కూడా బిల్లులు ఇవ్వరు. చాలావరకూ బిల్లులు లేకుండానే వసూలవుతుంది. నాయుడుపేటకు చెందిన ఓ వ్యక్తి పనిచేసే దగ్గర రంపం తెగి కాళ్లకు గాయాలతో ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ గాయానికి కట్టుకట్టినందుకు గాను రూ.10,500 వసూలు చేశారు. పోనీ వసూలు చేసిన మొత్తానికి బిల్లు ఇచ్చారా అంటే అదీ లేదు. రూ.1230 మాత్రమే బిల్లులో ఉంది. చెల్లించిన మొత్తానికి బిల్లు ఇవ్వాలని పేషంట్ తరపున వ్యక్తి అడిగితే, మొత్తానికి ఇవ్వలేమని తెగేసి చెప్పేయడం గమనార్హం. రంపంతో కాలు తెగితే రక్తం కారుతున్నా ఫస్ట్‌ఎయిడ్ చేయకుండా, రక్తపరీక్షలు చేశారన్నారు. ఓ వైపు రోగులకు బిల్లులు ఇవ్వకుండా ఫీజుల రూపంలో మోత మోగిస్తూ, ప్రభుత్వానికి పన్నులు కట్టకుండా మోసం చేస్తుండటం గమనార్హం. దగా పడుతున్న పేషంట్లు తిట్టుకుంటూ ఇళ్లకు వెళ్లడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి. జిల్లాలోని మెడికల్ అధికారులకు 'నాయుడుపేట అనే ఓ ఊరు ఉంది.. అక్కడ ఆస్పత్రులుఉన్నాయి.. ప్రజలున్నారు' అనే ఆలోచన కూడా లేనట్టుంది. ఉన్నతాధికారులు తనిఖీ నిర్వహిస్తే 'ఒట్టు'.

ఘాట్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు : సిఐ

ప్రజాశక్తి - తిరుమల

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల ట్రాఫిక్ పోలీసులు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. రాబోవు వైకుంఠ ఏకాదశి నాడు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా యాత్రికులను సురక్షితంగా తిరుమల తీసుకురావడం, తీసుకు వెళ్ళడము చేయాలన్నారు. ఘాట్ రోడ్‌కు ఎలిజిబులిటీ ఉన్న బస్సులను మాత్రమే పైకి తీసుకుని రావాలని, నిబంధనాలు పాటించాలని ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్ సూచించారు.

పూడీ-ఇలగనూరు రోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తొట్టంబేడు మండలంలోని పూడి-ఇలగనూరు లింక్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని చాలా కాలంగా ప్రతిపాదన ఉంది. వైసీపీ హయాంలో రాజకీయ కారణాలతో ప్రతిపాదన వాయిదా పడింది. సమస్యను ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి దష్టికి వెళ్లడంతో స్పందించారు. లింక్ రోడ్డు నిర్మాణంలో తలెత్తే సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం అధికారులు ఇరు గ్రామాల రైతులతో చర్చించి భూమిని సేకరించారు. పాల సరఫరా సంఘం మాజీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజానాయుడు పాల్గొన్నారు.

తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు గురజాడ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు గురజాడ అప్పారావు అని చర్మవ్యాధుల నిపుణులు, సినీ నిర్మాత అయిన డాక్టర్ యుగంధర్ అన్నారు. తిరుపతిలోని టంగుటూరి ప్రకాశం పంతులు ఉన్నత పాఠశాల నందు మంగళవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడు అని కొనియాడారు. గురుజాడ అప్పారావు గొప్ప వ్యక్తిత్వాన్ని వివరించారు. అలాగే పిల్లలు ఏ విధంగా శుభ్రతగా ఉంటే చర్మ వ్యాధులు రావో వివరించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలని, అలాగే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని, శుభ్రతను తప్పకుండా పాటించాలని తెలియజేశారు. టిపిపిఎం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆనంద్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు వరలక్ష్మి, అరవ జయపాల్ పాల్గొన్నారు.

18-20తేదీల్లో 'ఫ్లెమింగో ఫెస్టివల్'
రాష్ట్రపండుగలా నిర్వహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - దొరవారిసత్రం, తడ

సూళ్లూరుపేట నియోజకవర్గం నేలపట్టులో ఈనెల 18-20 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర పండుగలా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎంఎల్ఎ నెలవల విజయశ్రీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇరువురూ దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల కేంద్రాన్ని పరిశీలించారు. అధికారులు అందరూ సమిష్టిగా పనిచేసి వైభవంగా ఫెస్టివల్‌ను మూడు రోజుల పాటు నిర్వహించాలన్నారు. పక్షుల కేంద్రంలో మ్యూజియం, చెట్లపై విడిది చేసి పొదిగి ఉన్న సంతానోత్పత్తి పక్షుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులకు అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైల్డ్‌లైఫ్ డిఎఫ్ఓ, టూరిజం శాఖ ఆర్‌డిఇడి రమణకుమార్, డిడిటిఒ జనార్ధన్‌రెడ్డి, డిఎంఒ శ్రీనివాసులు, ఇఇ సుబ్రమణ్యం, తహశీల్దార్ శైలకుమారి, డిఎస్‌పి చెంచుబాబు, సిఐ సంగమేశ్వరరావు, టిడిపి మండలాధ్యక్షులు వేమసాని శ్రీనివాసునాయుడు పాల్గొన్నారు.

తడ మండలం భీమునివారిపాలెంలో పడవల రేవును పరిశీలించారు. స్థానిక నాయకులు పులికాట్ సరస్సు పూడికతీత గురించి అడిగారు. భీమునివారిపాలెంలో రోడ్డు సరిగ్గా లేదని, డ్రైనేజీ వ్యవస్థ లేదని కలెక్టర్ దృష్టికి స్థానికులు తెలిపారు. ఫ్లెమింగో ఫెస్టివల్ లోపే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.





ఫ్లెమింగో పక్షులను వీక్షిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

గాయపడిన కార్మికులను ఆదుకోండి: వామపక్షాలు

ప్రజాశక్తి - నారాయణవనం

మండలంలోని 'లక్కీ 4 యు ఎక్సమ్' కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికులను ఆదుకోవాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, జిల్లాకమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, సిపిఐ నాయకులు ఆర్.మహేష్, చంద్రబాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం రాత్రి ఫ్యాక్టరీలో బాయిలర్ గ్యాస్ పైప్ విరగడం వల్ల సంభవించిన ప్రమాదంలో పది మంది గాయపడ్డారన్నారు. యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా పుత్తూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించి ఇంటికి పంపేశారన్నారు. సోమవారం గాయపడిన కార్మికులను పరామర్శించామని, ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని తహశీల్దార్ జయరాములుకు వినతిపత్రం సమర్పించారు. ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేస్తున్న వస్తువులు ఎక్కడికి పంపిస్తారో, ఎందుకు పంపిస్తారో కూడా యాజమాన్యం చెప్పడం లేదన్నారు. నాయకులు నారాయణ, మునిశంకర్, రామచంద్రారెడ్డి, సుబ్రమణ్యంపిళ్లై, గిరి పాల్గొన్నారు.

సంకల్పబలం జీవిత సాఫల్యానికి మార్గదర్శకం



తిరుపతి సిటీ : క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు సాధించాలనే సంకల్ప బలంతో ముందడుగు వేస్తే ప్రతి ఒక్కరి జీవితం సాఫల్యం అవుతుందని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు యువతకు దిశా నిర్దేశం చేశారు. డాలర్స్ గ్రూపు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో, మెగా ఇంఫాక్ట్ వారి ఆధ్వర్యంలో యువతకు రెండు రోజులు పాటు తలపెట్టిన వ్యక్తిత్వ వికాస సదస్సు మంగళవారం మహతి కళాక్షేత్రంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణలు గంప నాగేశ్వరరావు, కమిషనర్ ఎన్ మౌర్య, డాలర్స్ గ్రూప్ అధినేత డాలర్ దివాకర్ రెడ్డి, వేణు కళ్యాణ్, ఐఏఎస్ ట్రైనర్ బాలలత అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా డాలర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, అన్నదాని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండువేల మంది విద్యార్థులు యువతి యువకులు పాల్గొన్నారు. ఇంపాక్ట్ కన్వీనర్లు తహసున్నీసా బేగం, విభూషణ శర్మ, డాలర్స్ గ్రూపు సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం: తహశీల్దారు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు: గ్రామీణ ప్రాంతాల్లో రైతుల రెవెన్యూ సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ధ్యేయం అని తహశీల్దారు రమేష్ బాబు అన్నారు. పిచ్చాటూరు పంచాయతీ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి డి ఇళంగోవన్ రెడ్డి , అరణియార్ ప్రాజెక్టు ఛైర్మన్ రవిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దారును కోరారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరిస్తామని తహశీల్దారు తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారాయల్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



ఉత్తమ రైతు అవార్డు గ్రహీత అంజలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: ప్రకృతి వ్యవసాయంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు అవార్డు అందుకున్న అంజలిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిచ్చాటూరు ప్రెస్ క్లబ్ భవనంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. ప్రకృతి వ్యవసాయం విస్తరణకు మెరుగైన సేవలు అందించి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచెచ్చన్నాయుడు నుండి అంజలి రాష్ట్ర స్థాయి ఉత్తమ మహిళా రైతు పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో అంజలికి పిచ్చాటూరు ప్రెస్ క్లబ్ భవనంలో ఎమ్మెల్యే అభినందనలు తెలిపి శాలువా కప్పి, గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ సత్యవేడు నియోజకవర్గానికి చెందిన అంజలికి రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు అవార్డు రావడం అందరికీ గర్వకారణమన్నారు. అంజలిని ఆదర్శంగా తీసుకుని రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు అలవాటు చేసుకోవాలని కోరారు. దీని ద్వారా నాణ్యమైన, ఆరోగ్యకర ఆహారం అందించాలని, భూమి సైతం సారవంతంగా ఉండేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ డీ ఇలంగోవన్ రెడ్డి, అరుల్ ప్రకాష్, వాసు రెడ్డి, చిన్న, రవి, రజిని, రమేష్, బత్తా రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం



ఉత్తమ రైతు అవార్డు గ్రహీత అంజలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకొచ్చిన సందర్భంగా గూడూరు పట్టణం లోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పాలాభిషేకం చేశారు. 'థాంక్యూ లోకేష్' అంటూ నినాదాలు చేశారు. టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం తీసుకొచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగంలో అనేక మార్పులు వచ్చాయని రాబోయే రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లు యాదవ్, జీవన్, ధనుష్, జయ, జగదీష్, వినయ్ పాల్గొన్నారు.

అధ్యాపకుల సంఘంలో పుత్తూరుకు ప్రాధాన్యత



డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘానికి ఎన్నికైన పుత్తూరు అధ్యాపకులు టి నరసింహులు, ఎం నరసింహులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతిలో రెండు రోజుల క్రితం ఎన్నుకున్న తిరుపతి జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపక సంఘం ఎన్నికల్లో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు తగిన ప్రాధాన్యత లభించింది. కళాశాల ఎకనామిక్స్ అధ్యాపకులు టి నరసింహులు తిరుపతి జిల్లా అధ్యక్షులుగా, తెలుగు అధ్యాపకులు డాక్టర్ మన్యం నరసింహులు జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, అధ్యాపకులు యూనియన్ ఎన్నికలలో గెలుపొందిన అధ్యాపకులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల సమస్యలను పరిష్కరించడంలో చొరవ తీసుకోవాలని కోరారు.

వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలి: కిరణ్ రాయల్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గేమ్ చేంజర్ ప్రీ ఈవెంట్ తర్వాత మెగా అభిమానులు రోడ్డు ప్రమాదంలో చనిపోయారని, గత వైసిపి హయాంలో రోడ్ల దుస్థితిని బాగు చేయలేక పోవడమే మెగా అభిమానుల రోడ్డు ప్రమాదానికి కారణమని ఇకనైనా వైసిపి నాయకులు శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని జనసేన తిరుపతి అసెంబ్లీ ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ సూచించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు సినిమాల చుట్టూ రాజకీయాలు కొనసాగుతున్నాయని ఎక్కడో రోడ్డు ప్రమాదం జరిగితే దానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బాధ్యులని, ఆయనపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వైసిపి చేస్తున్న ప్రచారం విడ్డూరంగా ఉందని, అసలు వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు ఏమైందని, ఆ విషయం మొదట తేల్చాలని వైసిపి నాయకులను ప్రశ్నించారు. చనిపోయిన మెగా అభిమానులు మణికంఠ, చరణ్‌కు అండగా నిలవడంతో పాటు ఆర్థిక సాయం అందించారని తెలిపారు. ఎక్కడో రోడ్డు ప్రమాదం జరిగితే దాన్ని పవన్ కళ్యాణ్ కు ఆపాదించడం సరికాదన్నారు.

ప్రసన్నలక్ష్మికి ఉద్యోగోన్నతి



ప్రసన్న లక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం హోమియో వైద్యాధికారిణిగా గత ఆరేళ్లుగా వైద్య సేవలు అందించిన ప్రసన్నలక్ష్మికి సీనియర్ మెడికల్ ఆఫీసర్ గా ఉద్యోగోన్నతి లభించి చిత్తూరు పట్టణానికి బదిలీ అయ్యారు. మంగళవారం మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు జయంతి, స్రవంతి, హోమియో వైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యశాల సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. మంగళం ప్రాంతంలో హోమియో వైద్య సేవలను డాక్టర్ ప్రసన్న లక్ష్మి విస్తరింపజేసి స్థానిక ప్రజలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల ఆదరాభిమానాలు పొందారు. ఉద్యోగోన్నతిపై చిత్తూరుకు వెళుతుండడంతో ప్రసన్న లక్ష్మిచే దీర్ఘకాలిక వైద్యం పొందుతున్న వారు ఈ వీడ్కోలు సమావేశానికి హాజరై కన్నీటితో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యశాల సిబ్బంది తారకనాథ్ పాల్గొన్నారు.

శ్రీ ప్రగతి విద్యానికేతన్‌లో స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలోని శ్రీ ప్రగతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూలులో విద్యార్థుల నేతృత్వంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమక్షంలో స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సబ్జెక్టులను చార్ట్ రూపంలో ఆక్టివిటీస్ రూపంలో ప్రదర్శించారు. దీనికి పాఠశాల ఛైర్మన్ పసుపులేటి కిషోర్ హాజరయ్యారు. స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ప్రోగ్రాంలో విద్యార్థులు చేసిన వివిధ నమూనాలను చూసి వారిని వివిధ ప్రశ్నలు అడిగారు. తల్లిదండ్రులకు లీడ్ ప్రోగ్రాం పట్ల సరైన అవగాహన కల్పించారు.లీడ్ ఛాంపియన్‌షిప్ ప్రోగ్రాంలో స్టేట్ ర్యాంక్స్ సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఛైర్మన్ కిషోర్ అభినందించారు. అనంతరం కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులలో స్పోకెన్ ఇంగ్లీష్ పట్ల ఉన్న భయాన్ని తొలగించి వాళ్లు ఆత్మవిశ్వాసంతో ఇంగ్లీషులో మాట్లాడేలా గత సంవత్సరం నుండి హలో ఇంగ్లీష్ ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు సులభంగా ఇంగ్లీషులో మాట్లాడవచ్చని కిషోర్ తల్లిదండ్రులతో చెప్పారు. స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ప్రోగ్రామ్ ను విజయవంతం చేసిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఛైర్మన్ పసుపులేటి కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.

పాకాల సీఐ సుదర్శన్ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -రామచంద్రపురం: తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పాకాల పోలీస్ స్టేషన్ లో సుదర్శన్ ప్రసాద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పోలీస్ సిబ్బంది ,పలువురు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ సుదర్శన్ ప్రసాద్ మాట్లాడుతూ తిరుపతి ఎస్పీ ఆఫీస్ విఆర్ నుంచి బదిలీపై పాకాల సిఐగా మంగళవారం బాధ్యతలు చేపట్టానని పేర్కొన్నారు. పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్వీయూ దూరవిద్యను సందర్శించిన యుజిసి నిపుణుల కమిటీ



ఎస్‌వి యూనివర్సిటీ దూర విద్యా విభాగాన్ని పరిశీలిస్తున్న యుజిసి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో దూరవిద్యా విభాగాన్ని పరిశీలించేందుకు వచ్చిన యుజిసి నియమించిన కమిటీ సభ్యులు ఆచార్య అశ్విని మహాపాత్ర, ఆచార్య రాజేంద్ర సింగ్, ఆచార్య అరవింద్ రనాడే, యుజిసి డిప్యూటీ సెక్రటరీ లెఫ్టినెంట్ కమాండర్ వినోద్ సింగ్ యాదవ్‌లు వర్సిటీని మంగళవారం సందర్శించారు. వీరికి వర్సిటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, డిడిఈ డైరెక్టర్ ఆచార్య తవమణిలు సాదర స్వాగతం పలికారు. వర్సిటీ విసి యుజిసి కమిటీ సభ్యులకు వర్సిటీ అనుసరిస్తున్న దూరవిద్య విధానాన్ని, అందిస్తున్న కోర్సులను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కమిటీ సభ్యులు దూరవిద్యా విభాగాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న వివిధ రకాల సేవలను పరిశీలించారు. వర్సిటీ పరిశోధక కేంద్రం డిఎస్టి – పర్స్ సెంటర్‌ను పరిశీలించారు. కమిటీ సభ్యులు సెనేట్ హాల్ లో దూరవిద్యలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులతో, అధ్యాపకులు, దూరవిద్య అధ్యాపకేతర సిబ్బందితో వేరువేరుగా ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డీన్లు చెంద్రాయుడు, నరసింహ, రాజశేఖర్ రెడ్డి, రమేష్ బాబు, రవి నాయుడు, డిడిఈ రమేష్ నాయుడు, గాలం దయ, గిరి కుమార్, ప్రహ్లాద్ రెడ్డి, పణిరమేష్, శరవణ, రవీంద్ర రెడ్డి, గోవిందు కోఆర్డినేట్ చేశారు.

సామాజిక తనిఖీ ప్రజావేదికలో అవినీతి బహిర్గతం

రూ.7 లక్షల సొమ్ము రికవరీ చేయాలని పీడీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండలంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదికలో అవినీతి బహిర్గతమైంది. సుమారు 7లక్షల రూపాయలు మేర పనుల్లో అవినీతి చోటుచేసుకుందని వెంటనే రికవరీ చేయా లని పీడీ శ్రీనివాసప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని 22 పంచాయతీలలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై దొరవారిసత్రం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పీడీ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. మొదట 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు చేసిన వివిధ ఉపాధి పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా 12 నెలల్లోనిర్వహించిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేశిన13 కోట్ల 96 లక్షల రూపాయల నిధులతో 22 పంచాయతీలలో నిర్వహించిన ఉపాధి పనులపై సమీక్షించారు. పనుల సమీక్షలో పంచాయతీలోని ఫీల్డ్ ఆఫీసర్లపై అసంతృప్తి వ్యక్తం చేసి మండిపడ్డారు. పనులు సక్రమంగా లేవని పనులకు సంబంధించిన రికార్డులు సక్రమం గా లేవని అసలు ఫీల్డ్ ఆఫీసర్ల పనితీరే బాగా లేదని సంబంధిత అధికారులపై మండిపడ్డారు. నిధుల అవకతవకలను గుర్తించి 22 పంచాయ తీల ఫీల్డ్ ఆఫీసర్ల కు రికవరీ అమౌంట్ పై 7 లక్షల రూపాయలకు పైగా చెల్లించాలన్నారు. ఈ 7లక్షల రూపాయలను త్వరగా రికవరీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన్, ఏపీడి వరప్రసాద్, డీఈఓ శివయ్య, క్వాలిటీ కంట్రోల్ శీనయ్య, ఏపీవో భాస్కరయ్య, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసరావు నాయుడు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం ..

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: బాల్య వివాహాలు చేయడం నేరమని బాల్య వివాహాల వ్యతిరేక పోరాట సమితి నిర్వాహకులు పేర్కొన్నారు. 'బాల్య వివాహాలను అరికడదాం.. బాలల జీవితాలు కాపాడుదాం' పోస్టర్లును మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పిల్లలకు 18 సంవత్సరాలు కాకముందే వివాహాలు చేయడంనేరమని అందువల్ల వారు ఆ వేళ ఇబ్బందులకు గురవుతున్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించి వారు ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాతే వివాహం చేయాలని సూచించారు. ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని రాష్ట్ర వ్యాప్తంగా బాల్య వివాహ నిర్మూలనకు కృషి చేస్తున్నా కొన్ని పల్లెటూరు గ్రామాలలో రహస్యంగా బాల్య వివాహాలు చేస్తున్నారని వారిపై చట్టపరమైనచర్యలు తీసుకుంటారని ఆయన హెచ్చరించారు. ఐసిడిసి సిడిపి మాట్లాడుతూ తమ ఐసిడిసి సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా బాల్య వివాహాలపై పోరాడుతోందన్నారు. స్థానిక ఎస్ఐ విశ్వనాథ నాయుడు మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల చిన్న వయసులోనే పిల్లలు పుట్టడం వారికి అనేక అనారోగ్యపరమైన సమస్యలు రావడం కుటుంబంలో కూడా వ్యతిరేకతలు రావడం వాటి వల్ల విడిపోయి పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగడం లాంటివి చాలా జరుగుతున్నాయని అలాంటి కార్యక్రమాలు తాము అడ్డకట్ట వేస్తామని తెలిపారు. బాల్య వివాహాల వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బాలికలకు 18, బాలురకు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రగతి ట్రస్టు కోఆర్డినేటర్ సుబ్రమణ్యం, సిడిపిఓ దేవకుమారి, అంగన్‌వాడీ సూపరువైజర్లు శిల్ప, యమున, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న టిసిఎస్ హెడ్ సప్తగిరి

ప్రజాశక్తి - గూడూరు టౌన్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శివప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ గూడూరు జోన్ మెన్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని యూఆర్ఓలోని టిసిఎస్ హెడ్ సప్తగిరి చేవల పల్లి ప్రారంభించారు. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్వీఆర్ట్స్ కాలేజీపై ఎస్‌కేఆర్ డిగ్రీ కాలేజి విద్యార్థులు గెలుపొంది ఫైనల్‌కి చేరుకున్నారు. తర్వాత బ్యాటింగ్ ఎంచుకున్న సూళ్లూరుపేట డిగ్రీ కళాశాల వైష్ణవి వెంకటగిరి కళాశాలపై గెలుపొంది ఫైనల్‌కి చేరుకుంది. కళాశాలలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌ను ఉద్దేశించి ప్రిన్సిపాల్ డాక్టర్ కే శివప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఆరోగ్యకరమైన సమాజానికి ఇవి అవసరమన్నారు. సప్తగిరి చేవల పల్లి మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడల్లో కూడా తమ సత్తా చాటాలన్నారు. ఈ కార్యక్రమాన్ని తన చేతులమీదుగా ప్రారంభించడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే శివ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీనివాసులు, కళాశాల డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి నారాయణ రాజు, సూళ్లూరుపేట డిగ్రీ కళాశాల పీడీ అమ్మాజీ, యూనివర్సిటీ అబ్జర్వర్ ఎం రవీంద్ర బాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి -పిచ్చాటూరు: ఎస్‌సి, ఎస్‌టిల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చింది కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. పిచ్చాటూరు టీచర్స్ కాలనీ ప్రెస్ క్లబ్‌లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలను అభివృద్ధిని విస్మరించిందని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఎస్‌సి, ఎస్‌టిలు ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఇందుకు ఏ గ్రామంలోనైనా ఎస్‌సి, ఎస్‌టిలకు ఆరు ఆవులు, గేదెలు ఉంటే వారు గోశాల నిర్మించుకోవడానికి ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల గ్రామాల్లో శ్మశాన వాటికలు, వాటికి రోడ్లు, గ్రామాల్లో సిసి రోడ్లు త్వరితగతిన స్థానిక ఎంపీడీవో ద్వారా, స్థానిక టిడిపి నాయకుల ద్వారా ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పిం చిందన్నారు. ఇది వారి అభివృద్ధికి ఉపయోగ పడుతుందన్నారు. గ్రామాల్లో సిసి రోడ్లు, శ్మశాన వాటికలు, వాటికి రోడ్లకు సంబంధించి కలెక్టర్‌తో కూడా చర్చించానని వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సమావేశంలో పిచ్చాటూరు మండల క్లస్టర్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు అరుల్ ప్రకాష్, వాసు రెడ్డి, చిన్న, ఎమ్మెస్ రవి, రజిని ,పాల్గొన్నారు.

మాస్ కూంబింగ్ ఆపరేషన్లు

అటవీ అధికారుల సమన్వయ సమావేశంలో ఎస్‌పి పి శ్రీనివాస్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ ప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ అటవీశాఖ అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సంయుక్త సమావేశంలో పేర్కొన్నారు. పెంచలకోన, సోమశిల, లంకమల అటవీ ప్రాంతాలలో అటవీశాఖ అధికారులతో కలిసి ఎస్‌పి శ్రీనివాస్ మంగళవారం పర్యటించారు. పెంచలకోన, బద్వేలు, సిద్దవటం, రైల్వే కోడూరులలో ఈ సమావేశాలను సోమ, మంగళవారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్లు అక్రమ రవాణాకు ఉపయోగించే ఎంట్రీ, ఎగ్జిట్, లోడింగ్ పాయింట్లు వద్ద నిఘా పటిష్టం చేయాలని సూచించారు. అటవీశాఖ చెక్ పోస్టులలో సిబ్బంది కొరత లేకుండా, తగు మౌలిక సదుపాయాలతో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. భవిష్యత్తులో టాస్క్ ఫోర్స్ అటవీశాఖతో కలసి ప్రత్యేక మాస్ కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. పాత నేరస్తులపై సాంకేతిక వ్యవస్థతో నిఘా ఉంచి, నేరాలకు మళ్లీ పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ సమావేశాల్లో డీఎస్పీలు జి. బాలిరెడ్డి, వీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీఎఫ్ జె శ్రీనివాస్, ఇతర టాస్క్ ఫోర్స్, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని పశువైద్య, డైరీ టెక్నాలజీ, మత్స్య కళాశాలలకు సంబంధించి 13వ అంతర్ కళాశాల సాంస్కృతిక, క్రీడా పోటీలలో మంగళవారం వర్సిటీ క్రీడా ప్రాంగణంలో వివిధ క్రీడా పోటీలలో గరివిడి కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. వర్సిటీ కళాశాలలో రెండవ రోజు జరిగిన ఇండోర్ గేమ్స్ లలో, అవుట్డోర్ గేమ్స్ లలో కూడా గరివిడి కళాశాల వెటర్నరీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పశువైద్య కళాశాల డీన్ ఆచార్య వీరబ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య జగపతి రామయ్య, కోఆర్డినేటర్లు డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

లక్ష్మీధర్ కుటుంబాన్ని ఆదుకోవాలి



ఆర్‌డీవోకు వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకుడు గాలి మురళినాయుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం వాలగమంద కాలువలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన విద్యార్థి లక్ష్మీధర్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ మండల టిడిపి అధ్యక్షులు గాలి మురళి నాయుడు కోరారు. మంగళవారం ఆయన ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన లక్ష్మీధర్ తండ్రి సురేష్ ది నిరుపేద కుటుంబమని, కొడుకు చేతికి అంది వచ్చే సమయంలో అకాల మరణం చెందడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య పాల్గొన్నారు.

డీకేటి భూములు పునరుద్ధరించండి..

- రెవెన్యూ సదస్సులో రైతులు వేడుకోలు
- 241 ఫిర్యాదులు, 58 ఫిర్యాదులు పరిష్కారం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: గత ప్రభుత్వాలలో జన్మభూమి, ప్రజల వద్దకు పాలన, భూ పంపిణీ కార్యక్రమాలలో పేదలకు ఇచ్చిన డీకేటి భూములను పునరుద్ధరించాలని తహశీల్దారు కే వెంకటరమణను డీకేటీ భూములు కోల్పోయిన పేద రైతులు వేడుకున్నారు. మండలంలోని అనుపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించిందని, అనుపల్లి పంచాయతీలో రద్దయిన డికెటి భూములను పునరుద్ధరించడానికి స్థానిక ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ డి బిందు మాధవి మాట్లాడుతూ గ్రామాలలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం ఎంతో ఉపయోగకరమకరమని, ఇది మంచి ప్రభుత్వమని కొనియాడారు. తహశీల్దారు వెంకటరమణ మాట్లాడుతూ డిసెంబర్ 6వ తేదీ నుండి జనవరి 7వ తేదీ వరకు గ్రామాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 241 రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదుల అందాయని, వాటిలో 58 రెవెన్యూ సమస్యలను పరిష్కరించామని తెలిపారు. అనుపల్లి పంచాయతీలో భూ సర్వే నెంబర్లు పెద్ద సంఖ్యలో గవర్నమెంట్, నోషనల్ ఖాతాలో పడ్డాయని, రైతుల భూములు మిత్రుల పేరుతో ఆన్‌లైనులో నమోదు అయ్యాయని ఆ సమస్యలను పరిష్కరించాలని రైతుల నుంచి 45 ఫిర్యాదులు అందాయని వాటిని రికార్డులు పరిశీలించి పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అనుపల్లిలో రెవెన్యూ సదస్సులో రైతుల అధికంగా పాల్గొన్నారు. సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌సిపురం లో రెవెన్యూ సదస్సులు మంగళవారం ముగియడంతో రెవెన్యూ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు చేకూరి జనార్దన్ చౌదరి, అక్కా దేవరాజులు, పంతల వెంకటేష్ నాయుడు, బండి విజయ్ కుమార్ రెడ్డి, ఏ సిద్దయ్య, సోము, జవాది ప్రకాష్,, బండి లీలాప్రసాద్ రెడ్డి,చిట్టిబాబు రాయల్, సర్పంచ్ గోవర్ధన్ యాదవ్, ఆర్ఐ లక్ష్మీనారాయణ, సర్వేయర్ రమేష్ బాబు, వీఆర్వోలు రాజశేఖర్, వెంకటరమణ, మల్లికార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

క్రైం న్యూస్

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రోడ్డు మీదున్న కుక్కలను తప్పించే ప్రయత్నంలో కారు వేగంగా దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న సంఘటన తిరుపతి కరకంబాడీ రోడ్డులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..పంజాబ్‌లో డెలివరీ చేసిన వాహనంతో బంగారుపాలెంకు చెందిన ఆర్మీ ఉద్యోగులు రోహిత్, ప్రశాంత్ తిరుపతిలో తన బంధువు కానిస్టేబుల్ ఇంట్లో ఓ కార్యక్రమానికి వెళ్లారు. తిరుగు పయనంలో తిరుచానూరుకు బయలుదేరారు. తిరుపతి–కరకంబాడి రోడ్డులో అత్తూరు డాబాను సమీపిస్తుండగా రోడ్డుపై గుంపుగా వున్న కుక్కలను తప్పించే ప్రయత్నంలో వేగాన్ని అదుపు చేయలేక శ్రీ శ్రీనివాస రెసిడెన్సి అపార్టుమెంటు ముందు ఓ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కారు ఇరుక్కుపోయింది. వెంటనే కారు బెలూన్లు తెరుచుకొని వాహనం నుండి ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. అయితే ఈ ప్రమాదానికి విద్యుత్ స్తంభం విరిగి పోవడంతో విద్యుత్తులైన్ తెగి పడి అపార్టుమెంటు వాచ్‌మ్యాన్ కాలికి గాయమైంది. అలిపిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు.. గూడూరు మండల పరిధిలోని చెన్నూరులోని హరిజన వాడలో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చెన్నూరు హరిజన వాడకి చెందిన గున్న బుజ్జయ్య (65) తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు 108 ద్వారా స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భక్తుల పైకి108 దూసుకెళ్లిన ఘటనలో మరొక మహిళ మృతి

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి:): అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలానికి చెందిన గోవింద మాల వేసుకుని శ్రీవారి దర్శనానికి పాదయాత్రగా వెళుతుండగా భక్తులపై సోమవారం రంగంపేట (నారాయణ కాలేజ్ వద్ద) తెల్లవారుజామున 108 వాహనం దూసుకెళ్లిన సంఘటలో ఇద్దరు మహిళలు మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో గాయపడి ఆరోగ్యం విషమించి రామసముద్రం మండలం చింపరపల్లి గ్రామానికి చెందిన ఎన్ రమణారెడ్డి భార్య ఎన్ తులసమ్మ (40) మంగళవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల ఆరవ తేదీ జయశం థియేటర్ రోడ్డు లోని భారతి వైన్ షాప్ ముందు జరిగిన హత్య కేసులో కార్వేటినగర్‌కు చెందిన ధనవేలు, చిక్కబల్లాపూర్‌కు చెందిన శ్రీనివాసులు, బి కొత్తకోటకు చెందిన చందు, తమిళనాడుకు చెందిన మహాప్రభు, చెన్నైకి చెందిన తమిళ అరసన్, అన్నమయ్య జిల్లాకు చెందిన దేరంగుల శివలను తిరుపతి ఆర్టీసీ బస్టాండ్‌లో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మొదటి నిందితుడు ధనవేలు పదేళ్లుగా తిరుమల కొండ పై యాత్రికులకు దారాలు అమ్ముకొంటూ, తన లాగా దారాలు అమ్మే కృష్ణ, చందు, మహాప్రభు, తమిళ అరసన్, దేరంగుల శివలకు పరిచయం అయ్యారు. అందరూ కలిసి వ్యాపారం లేని సమయములలో గుడి, నాలుగు మాడ వీధులలో యాత్రికులు వదిలిపెట్టిన చెప్పులను దొంగలించి తిరుపతిలో అమ్మకొని, వచ్చిన డబ్బుతో తాగి చెడు తిరుగుళ్లు తిరిగేవారు. ఈ క్రమంలో మూడు సంవత్సరాల క్రితం తిరుపతి బండ్లవీధికి చెందిన సాయి కుమార్ 7వ మైలు వద్ద బొరుగుల గంప పెట్టుకొని వ్యాపారం చేస్తున్న సమయంలో ధనవేలు కు పరిచయం అయ్యాడు. అతనితో వ్యాపారం చేస్తూ మద్యం సేవించేవాడు. సాయి కుమార్ కొంత కాలానికి తిరుపతి చేరి ఆటో డ్రైవరుగా స్థిరపడినాడు. అయినా ధనవేలు తిరుపతి వచ్చినప్పుడు సాయికుమార్ ను కలిసి ఇద్దరూ మద్యం తాగేవారు. కొండ మీద ధనవేలుకు కొత్త స్నేహితులు పరిచయం కావడంతో సాయి కుమార్‌ను ధనవేలు నిర్లక్ష్యం చేస్తున్నాడని, అడిగినప్పుడు మద్యం తీసివ్వడం లేదని, ధనవేలు కనబడినప్పుడు సాయి కుమార్ చెయ్యిచేసుకొనే వాడని, సాయి కుమార్ వల్ల తనకు ఎప్పటికైనా ప్రాణహాని వుందని వాడిని ఎలాగైనా మద్యం తాగటానికి పిలిపించి చంపేయాలని ధనవేలు తన స్నేహితుల వద్ద చెప్పి పథకం వేసుకున్నారు. ధనవేలును భయపడవద్దని, అలాగే చేద్దామని 6వ తేదీ ఉదయం అందరూ కలుసుకొని తిరుమల నుండి బయలు దేరి తిరుపతి చేరి వేరేగా మద్యం తాగి తిరిగి జయశ్యామ్ రోడ్ లోని భారతి వైన్ షాప్ వద్ద మద్యం తాగారు. ముందే వేసుకొన్న పథకం ప్రకారం సాయి కుమార్ కు ఫోన్ చేసి భారతి వైన్ షాప్ వద్దకు పిలిపించుకొని, అందరూ కలిసి బీర్ బాటిల్‌లతో సాయికుమార్ తలపై, ముఖంపై, ఛాతీపై దాడి చేశారు. చుట్టుపక్కల వారు అడ్డుకోగా అక్కడి నుండి పారిపోయారు. తీవ్ర గాయాలతో వున్న సాయి కుమారును సంకల్ప హాస్పిటల్ లో చికిత్స కోసం చేర్పించారు. సాయికుమార్ పరిస్థితి విషమంగా వుందన్నారు. పోలీసులకు సమాచారం మేరకు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండుకు తరలించినట్లు తెలిపారు. నిందితుల అరెస్టుకు కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.

టిడిపి నేతకు నివాళి



టిడిపి నేతకు నివాళులర్పిస్తున్న నెలవల రాజేష్

ప్రజాశక్తి--నాయుడుపేట: నాయుడుపేట మండలం కారు మంచి వారి కండ్రిగ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు తొప్పాని బాబు రావుకు టిడిపి నేత నెలవల రాజేష్ స్థానిక టిడిపి నాయకులతో కలిసి నివాళులర్పించారు. సోమవా రం తొప్పాని బాబురావు గుండె పోటుతో కన్ను మూశారు. సమాచారం తెలుసుకున్న టిడిపి నేత నెలవల రాజేష్ మంగళవారం ఉదయం కారుమంచి వారి కండ్రిగకు వెళ్లి బాబురావు భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాబురావు కుటుంబ సభ్యులను పరామర్శించి, టిడిపి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం బాబురావు కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బిరద వాడ నారాయణ, మల్లాం రవి, తొప్పాని వెంకటరమణయ్య, పల్లెలి అంకయ్య పాల్గొన్నారు.

వైజ్ఞానిక పోటీల్లో బాలికలకు ప్రశంస

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థినులు జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రశంసా పత్రాలు అందుకు న్నారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రమణయ్య, ఎంఈవో ముదిసుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ తమ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థినులు ప్రదర్శించిన రెయిన్ వాటర్ హార్వెస్ట్ ఇన్ రోడ్డు సేఫ్టీ ప్రాజెక్టుకు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తృతీయ స్థానం సాధించిందన్నారు. ఇందుకు ప్రోత్సహించిన తిరుపతి డీఈవో కెవిఎన్ కుమార్, పుత్తూరు డివైఈవో హెచ్ ప్రభాకర్ రాజు కు కృతజ్ఞతలు తెలిపారు. బాలికలు ఎం చరిత, ఎం హారికలకు అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, గైడ్ టీచర్ గౌరీ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణ వ్యాపారి మోసం

- సగం ధరకే గృహోపకరణాలు ఇస్తామని రూ. కోటి వసూలు,
- బోర్డు తిప్పేసిన వ్యాపారి
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలో భారీ మోసం వెలుగుచూసింది. సుమారు కోటి రూపాయలకు పైగా కాజేసిన ఓ గృహోపకరణాలు దుకాణ వ్యాపారి బోర్డు తిప్పేశాడు. సగం రేటుకే గృహోపకరణాలు అంటూ ప్రజల నుంచి ముందు డబ్బులు సేకరించారు. సగం ధరకే వస్తులువులు వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్న బాధితులకు కుచ్చు టోపి పెట్టివెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న బాధితులు దుకాణం వద్దకు చేరుకుని దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కోట పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సమీపంలో ఆర్ఆర్ ట్రేడర్స్, ఆర్డర్స్ సప్లైయర్స్ అనే పేరుతో ఓ దుకాణాన్ని ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఏ వస్తువైనా సగం ధరకే విక్రయిస్తామని కరపత్రాలను తయారు చేసి కోట, వాకాడు, చిట్టమూరు మండలాలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి అందించారు. సంక్రాంతి పండుగ ఆఫర్ అని ప్రజలను నమ్మబలికిన వ్యాపారులు ముందుగానే ప్రజల నుంచి సగం డబ్బులు కట్టించుకున్నారు. కట్టించుకున్న వారికి ఆయా సామగ్రిని అందించారు. ఈ విషయం నెమ్మదిగా గ్రామ, గ్రామానికీ పాకడంతో సగం ధరకే వస్తువులు వస్తాయని భావించిన ప్రజలు అధిక సంఖ్యలో డబ్బులు కట్టారు. ఈ నెల 14వ తేదీన బాధితులకు వస్తువులను అందించాల్సి వుంది. అయితే మంగళవారం ఉదయం నుంచి సదరు దుకాణం నిర్వాహకుల ఫోన్లు స్విచ్ ఆఫ్ చేయడంతో ఆందోళనకు గురైన బాధితులు దుకాణం వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో చర్చిస్తున్నారు.


మొత్తానికి నమ్మించి మోసపోయామని బాధితులు షాప్ ముందు లబోదిబోమంటున్నారు.

విద్యుత్ సమస్యలపై స్పందన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం కారణి మిట్ట పంచాయతీ పరిధిలోని విద్యుత్ సమస్యలను కారణిమిట్ట గ్రామ సర్పంచి కుమారుడు కందేరి కార్తీక్ నాయుడు పంచాయతీలోని విద్యుత్ సమస్యలపై ఏఈ చలపతి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఏఈ చలపతి కారణి పంచాయతీలో వీధి వీధి తిరిగి ప్రజలను అడిగి విద్యుత్ సమస్యలు తెలుసుకుని వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని తెలిపారు. అంతేకాకుండా లో వోల్టేజి సమస్యలతో ఇబ్బంది పడుతున్న గ్రామస్తులకు పోరాటం కలిగించి ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చారు. గ్రామంలో వీధిలైట్లు సమస్య ప్రతి సమస్యపై స్పందించి అసిస్టెంట్ ఇంజినీరింగ్ చలపతి త్వరలో ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, గ్రామ టిడిపి కార్తీక్ నాయుడు పాల్గొన్నారు.

జాతీయ యువజన దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి రామకృష్ణ మిషన్ ఆశ్రమం, జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం విద్యార్థులు వివేకానంద సర్కిల్ నుండి రామకృష్ణ మిషన్ ఆశ్రమం వరకూ మంగళవారం నిర్వహించిన యువజనోత్సవ ర్యాలీలో విశ్వవిద్యాలయం విద్యార్థినులు 50 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయోజకులు మాట్లాడుతూ వివేకానంద అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలని సూచించారు. ప్రపంచానికి భారతీయతను పరిచయం చేసిన మహాపురుషుడు వివేకానంద అని తెలిపారు. రామకృష్ణ ఆశ్రమంలోని సభాభవనంలో విద్యార్థులందరికీ సభను నిర్వహించి, విద్యార్థులు వారి జీవితంలో దేశం కోసం చేయాల్సిన లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం సాహిత్య విభాగం అధ్యాపకురాలు కో–ఆర్డినేటర్ డాక్టరు బల్టీదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా జనవరి 1వ తేది నుంచి 12వ తేది వరకు చేపట్టిన "ప్రగతి వారోత్సవాలు" ఘనంగా నిర్వహిస్తున్నారు. గూడూరు పట్టణం లోని బాలాజీ నగర్ లోని ప్రగతి కార్యాలయంలో పూలతోట గిరిజన కాలనీకి చెందిన ఓ మహిళకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో కుట్టు మెషిన్‌ను మన ప్రగతి కుటుంబ సభ్యుడు గదిరాజు రాజశేఖర్ వర్మ సహకారంతో అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మయూరి శ్యామ్ యాదవ్ చేతుల మీదగా అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ బండి విజయమ్మకు జీవనోపాధి కల్పించాలని కుట్టు మిషన్ అందించామని పేర్కొన్నారు. ప్రగతి సేవా సంస్థ ద్వారా 43 కుట్టు మిషన్లు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్, కేఆర్ఎం, వాచ్ షాప్ రాము, శ్యాము, ఆర్‌వి కన్సల్టెంట్ వెంకట కృష్ణయ్య, వై కృష్ణారెడ్డి, కోటా వెంకటేశ్వర్లు, డిష్ నాగరాజు, కుమార్ నాయుడు, సంచి ముని ప్రసాద్ సతీష్ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి విస్తృత భద్రత

- జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు
- ఎస్‌పి సుబ్బరాయుడు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలను పురస్కరించుకుని టీటీడీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీధర్, పోలీస్, టిటిడి అదికారులతో కలిసి తిరుపతి నగరంలో ఏర్పాటు చేసిన వైకుంఠ దర్శన టోకెన్లు జారిచేసే కేంద్రాలను, అక్కడ నిర్వహిస్తున్న ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి ఎల్. సుబ్బరాయుడు సమీక్షించి, కీలకమైన ప్రాంతాలలో భక్తులకు ఇక్కట్లు కలగకుండా సౌకర్యాలు, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. భక్తుల రద్దీ, ట్రాఫిక్ నిర్వహణ, ఎమర్జెన్సీ సేవలకు సంబంధించిన విషయాలను పర్యవేక్షించారు. పోలీస్, టీటీడీ అధికారులు, ఇతర సహాయక విభాగాలతో సమన్వయం చేస్తూ, భక్తులు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతి పొందేలా చర్యలు చేపట్టారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి సందర్భంలో తిరుమలలో భక్తుల సంఖ్య విపరీతంగా పెరగడం సాధారణమని వారి సౌకర్యాల కోసం అధిక సంఖ్యలో పోలీసులు, సిబ్బందిని మొబలైజ్ చేశారు. ఈ ఏర్పాట్లను సజావుగా అమలు చేసేందుకు పోలిస్ యంత్రాంగంతో గట్టి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమలలో 1 కేంద్రం, తిరుపతిలో 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కౌంటర్ల వద్ద కావాల్సిన భద్రతను పెంచి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బయట హోల్డింగ్ పాయింట్స్, క్యూలైన్స్ ఏర్పాటు చేశారు. ఎవరూ తొందరపడి ఏమాత్రం తోసుకోకుండా క్యూలైన్లో వచ్చి, అందరూ వారికి సమయం వచ్చే వరకు ఆగి టికెట్లు పొంది, సురక్షితంగా వెళ్లాలని, భక్తులు, ప్రజలు పోలీసులకు సహకరించి నిర్దేశించిన క్యూలైన్స్ లో వెళ్లి టోకెన్ తీసుకోవాలని కోరారు. భద్రత పరమైన అన్ని ఏర్పాట్లు చేశామని, ముఖ్యంగా క్యూలైన్స్ ఉన్న వారికి రాత్రి సమయంలో కావాల్సిన సౌకర్యాలు కల్పించామని, వచ్చిన అవకాశాన్ని వినియోగించుకొంటూ భక్తులు భద్రతాపరంగా పోలీసులకు సహకరించాలని కోరారు.

డిప్యూటీ డీఈవో విచారణ

సోషల్ మీడియా కథనంపై స్పందన

ప్రజాశక్తి -రామచంద్రపురం(చంద్రగిరి): చంద్రగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంపై విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం, పిల్లల ఆరోగ్యంతో టీచర్ల ఆటలు- పిల్లలు తంటాలు పేరుతో సోషల్ మీడియాలో వచ్చిన వార్తకు తిరుపతి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ స్పందించారు. మంగళవారం ఉదయం చంద్రగిరి జడ్పి ఉన్నత బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ప్రధానోపాధ్యా యులు, వంట మనుషులతో విచారణ చేపట్టారు. పాఠశాల విద్యార్థినులకు వడ్డిస్తున్న అన్నంలో లోపాలు లేవని నాణ్యత ప్రమాణాలతోనే సిబ్బంది విద్యార్థులకు భోజనం అందిస్తున్నట్లు గుర్తించారు. శనివారం సుమారు 1200 మందికి మధ్యాహ్నం భోజనం తయారు చేసిన నాలుగు పాత్రలలోని ఓ పాత్రలోని అన్నం తిన్న కారణంగానే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని అస్వస్థతకు గురైన విద్యార్థినులు అందరూ ఆసుపత్రి నుంచి క్షేమంగా డిశ్చార్జ్ అయ్యి ఆరోగ్యంగా ఉన్నారన్నారు. ఇకపై అలాంటి సంఘటన జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సంఘటనకు కారకులైన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మంగళవారం నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకం పేరుతో అమలపరుస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. మండల విద్యాధికారి–2 భాస్కర్ బాబు, ప్రధానోపాధ్యాయులు వెంకట రమణారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో చర్చిస్తున్న డిప్యూటీ డీఈవో బాలాజీ

యుజిసి డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్‌పై ఏబిఆర్ఎస్ఎం హర్షం

ప్రజాశక్తి - క్యాంపస్ : దేశంలోని కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు డిగ్రీ కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థలలో అధ్యాపకుల నియామకాల కోసం, ఉద్యోగోన్నతుల కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ మంగళవారం విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ పట్ల అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్సిక్ మహా సంఘం హర్షం వ్యక్తం చేస్తూ ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో ఉన్నత విద్యారంగంలో పనిచేస్తున్న, నూతనంగా నియామకం కానున్న పరిశోధక విద్యార్థులు అందరికీ కూడా ఎంతో ఉపయోగకరంగా వుందని భావిస్తోం దన్నారు. ముఖ్యంగా విశ్వవిద్యాలయాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకానికి పీహెచ్‌డి డిగ్రీ తప్పనిసరి చేయటం, అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్ ఉద్యోగోన్నతి ప్రస్తుతం ఉన్న 12 సంవత్సరాల కాల వ్యవధిని ఎనిమిది సంవత్సరాలకు కుదించటం, ప్రొఫెసర్ నుంచి సీనియర్ ప్రొఫెసర్‌కు ఉద్యోగోన్నతి కల్పించడం, స్థానిక భాషలో పరిశోధనా పత్రాలను ప్రచురించడాన్ని ప్రోత్సహించడం, అధ్యాపకుల ఉద్యోగోన్నతి కెరీర్ అడ్వాన్స్ స్కీమ్ ప్రతి ఆరు నెలలకి ఒకసారి తప్పనిసరిగా చేయడం, కాంట్రాక్టు అధ్యాపకులకు సరైన సదుపాయాలు కల్పించడం, మొదలైనవి అధ్యాపక వర్గానికి ఎంతో మేలు చేస్తాయని రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి అన్నారు. అధ్యాపకుల నియామకాలలో యూజీసీ నియమ, నిబంధనలు అమలు చేయని విశ్వవిద్యాలయాలను యుజిసి స్కీములకు దూరం చేయటం, యూజీసీ గుర్తింపు అయిన 2 (ఎఫ్), 12 (ఎ)లను తొలగించటం, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్స్‌ని తీసివేయటం, డిగ్రీ ప్రోగ్రాములకు అనుమతి రద్దు చేయటం మొదలైన నిబంధనల వల్ల అధ్యాపకుల నియామకాలలో పారదర్శకత ఎంతైనా పెరుగుతుందని తద్వారా అర్హత కలిగిన మెరిట్ అభ్యర్థులకు ఎంతైనా న్యాయం చేకూరుతుందని తెలిపారు. అధ్యాపకుల ఉద్యోగోన్నతులు కఠినంగా ఉన్న కొన్ని నియమ నిబంధనలను సరళతరం చేయాలని ఏబిఆర్ఎస్ఎం యుజిసికి విజ్ఞప్తి చేస్తోందన్నారు. ఉన్నత విద్యారంగంతో సంబంధం ఉన్న అధ్యాపకులు, అధికారులు, విద్యావేత్తలు అందరూ ఈ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్ పై ఫిబ్రవరి 5 వ తేదీ లోపు యూజీసీ కి సూచనలు, సలహాలు పంపవచ్చని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కిశోర బాలికలు రక్తహీనత లేకుండా మంచి పౌష్టిక ఆహారం తీసుకోవాలని వడమాల పేట తమశీల్దారు ఎస్ జరీనా పేర్కొన్నారు. వడమాలపేట మండలం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కిశోరి వికాసం మండల స్థాయి శిక్షకుల శిక్షణ ఐసిడిఎస్ సూపర్వైజర్లు వై రోజా రమణి, కె మనీల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేషన్ సైకాలజిస్ట్ గుణశేఖర్ కిశోరి బాలికలు పాటించాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనత , భౌతిక ఆకర్షణ, హనీ ట్రాప్ గురించి వివరించారు. అనంతరం పోలీసు శాఖ ఏఎస్ఐ బాల్య వివాహాలు, చట్టం, బాలల అక్రమ రవాణా, సైబర్ క్రైమ్ విషయాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్టుమెంట్ సిహెచ్ఓ పురుషోత్తం రెడ్డి , ఎంఈఓ పద్మావతి, ఏపిఎం మునికృష్ణారెడ్డి, దయా సాగర్, ఎంపీపీ , పాఠశాల ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు , విఓ లీడర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోట : కోట పట్టణంలోని ఎంపిడిఓ కాన్ఫరెన్స్ కార్యాలయంలో ఐసిడిఎస్ సీడీపీఓ ముని కుమారి ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల స్థాయి శిక్షకుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కోట తహశీల్దారు కే.జయ జయ రావు, ఎంపిడిఓ వై వేణు, ఎమ్ఈఓలు శైలజ, దారా మస్తానయ్య, ఐసీడిఎస్ సీడీపీఓ మునికుమారిలు మాట్లాడుతూ విద్యార్థినులు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, వాటిపై తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు వివరించారు. ప్రతి గ్రామంలో విద్యార్థినుల గురించి తమ తల్లిదండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపరువైజరు కృష్ణమ్మ, కవిత, మహిళా పోలీసులు, ఎంఈఓ కార్యాలయం సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైయస్ జగన్‌తో నేదురుమల్లి భేటీ

ప్రజాశక్తి- వెంకటగిరి: తాడేపల్లి వైసిపి కార్యాలయంలో వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గంలో కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసుల గురించి నేదురుమల్లి మాజీ సీఎం వైఎస్ జగన్ కు వివరించినట్లు సమాచారం.



సైన్స్ సింపోసియం ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో సైన్స్ సింపోసియంను గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడు తూ ప్రస్తుతం ప్రపంచం అంతా సైన్స్ ఆవశ్యకతను గుర్తించి, సైన్స్ పరిశోధనలో అనేక వస్తువులు సృష్టించి మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విద్యార్థుల అభ్యుదయానికి పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు, అకాడమిక్ డీన్ సునీల్ రాజ్, అకాడమిక్ కోఆర్డినేటర్ హరికృష్ణ, ప్రైమరీ ఇన్‌ఛార్జి సింధు, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వివిధ ప్రాంత పాఠశాలల విద్యార్థులు, ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించండి..

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిహెచ్ వద్ద ఆశా వర్కర్ల యూనియన్(ఏఐటియుసి) గౌరవ అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంల గొల్లపల్లి , మ్యాక్ సెంటర్, యుపిహెచ్‌సి గోవిందపాళెం వద్ద నిర్వహిం చారు. – ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమావతి, మారమ్మ, స్వర్ణ, మైమునిషా, ప్రమీల, సీతారాధ, అలిమేలమ్మ, విద్య, ధనలక్ష్మి, మరియమ్మ, హరిత, సులోచన, వెంకటరత్నమ్మ పాల్గొన్నారు.